సాక్షి
శ్రీకాకుళం
శనివారం ♦ 11 ♦ జనవరి ♦ 2025







శ్రీకాకుళం కల్చరల్ : డీసీసీబీ కాలనీలో వెంకన్నకు పూజలు

శ్రీకాకుళం కల్చరల్ : పాతశ్రీకాకుళంలోని కల్యాణ వేంకటేశ్వరుని అలంకరణ

నక్కవీధి రామమందిరంలో



అరసవల్లిలో స్వామి తిరువీధి, ఉత్తర ద్వార దర్శనం





శ్రీకాకుళం మొండేటివీధిలో క్యూలో భక్తులు



గార: శ్రీకూర్మంలో ఉత్తర ద్వారం వద్ద స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



నారాయణ తిరుమలలో క్యూలైన్‌లో భక్తులు

గోవిందాశ్రిత గోకుల బృంద..

తులసి మాలల సువాసనలతో ఆలయ ఆవరణలు ఆహ్లాదంగా మారాయి. గోవింద నామ సంకీర్తనలతో క్యూలన్నీ తిరునామాలను తలపించాయి. వైకుంఠ ఏకాదశి సందర్భంగా వైష్ణవ క్షేత్రాలు కిటకిటలాడాయి. వేకువజాము నుంచే భక్తులు దర్శనాలకు పోటెత్తారు. ప్రత్యేక అలంకరణల్లో స్వామి మెరిసిపోయారు.

న్యూస్‌రీల్

13న నగరంపల్లిలో జానపద కళామేళా

వజ్రపుకొత్తూరు రూరల్: సంక్రాంతి వేడుకలు సందర్భంగా ఆంధ్ర నాట్యమండలి, గిడుగు రామ్మూర్తి కళావేదిక ఆధ్వర్యంలో మండలంలో గల నగరంపల్లిలో ఈ నెల 13న సాయంత్రం 5 గంటల నుంచి జానపద కళామేళా నిర్వహించనున్నట్లు జానపద కళాకారుల సంఘం కార్యదర్శి ఎస్.మనోజ్, నాట్యమండలి సభ్యులు ఎన్.చంద్రయ్య తెలిపారు. కనుమరుగు అవుతున్న జానపద కళలకు పూర్వ వైభవం తీసుకు రావడానికి నగరంపల్లి కళావేదిక కానుందన్నారు. కళామేళాలో తప్పిడిగుళ్ల ప్రదర్శన, ఘటోత్కజుడు, సోది, హరిదాసు, కొమ్మదాసరి,అసిరయ్య పాటలు, పిట్టల దొర, ఎరుకల పాటలతో పాటు మత్స్యకార జానపద ప్రదర్శన, మిమిక్రీ తదితర ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

శ్రీవారికి పుష్పయాగం



హిరమండలం మండలంలోని శుభలయ తపోగిరి మెట్టపై కొలువైన వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా పుష్పయాగం నిర్వహించారు. ముందుగా అర్చకులు స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

– హిరమండలం

పేకాట, కోడిపందాలు ఆడితే కఠిన చర్యలు : ఎస్పీ

శ్రీకాకుళం క్రైమ్ : సంక్రాంతి పురస్కరించుకుని జిల్లాలో పేకాట, కోడిపందాలు వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించేవారిపై గట్టి చర్యలుంటాయని, పండగను సంప్రదాయపద్ధతిలో ప్రశాంతంగా జరపుకోవాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి స్పష్టం చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన పత్రికా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జూదం, గుండు, డొక్కు ఆటలు, బెట్టింగ్ వంటి కార్యకలాపాలు నడపరాదని, గంజాయి, ఇతర మత్తు పదార్థాలు క్రయవిక్రయాలు, సేవించిన వారిపై చర్యలుంటాయని, కోడి కత్తుల తయారీ, విక్రయాలు చేసే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అక్రమ మద్యం, గంజాయి రవాణా అరికట్టేందుకు ప్రధాన చెక్‌పోస్టులు, రహదారి మార్గాలు, ముఖ్య కూడళ్లలో పోలీస్ పెట్రోలింగ్, బీట్ సిబ్బందితో ప్రత్యేక గస్తీలు ఏర్పాటు చేశామన్నారు. పండక్కని స్వగ్రామాలకు వెళ్లేవాళ్లు విలువైన ఆభరణాలు, వస్తువులు తీసుకువెళ్లాలని, లాకర్లలో భద్రపర్చాలని, ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలు వినియోగించుకోవాలన్నారు. చిన్నపిల్లలకు వాహనాలు ఇవ్వరాదని, మద్యం సేవించి బళ్లు ర్యాష్‌గా నడపరాదని, అమ్మాయిలను ఈవ్ టీజింగ్ చేసేవారిపై చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. పైన పేర్కొన్న అసాంఘిక కార్యకలాపాల సమాచారం తెలియజేయాలనుకునేవారు 6309990800 (ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి)
6309990886 (సీఐ, స్పెషల్‌బ్రాంచ్)
6309990933 (పోలీస్ వాట్సాప్ నంబర్)
డయల్ 100 నంబర్లకు డయల్ చేసి సమాచారం ఇవ్వవచ్చన్నారు.

275 మంది ఎంపిక

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో ఏపీ పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో భాగంగా పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు కొనసాగుతున్నాయి. గత నెల 30వ తేదీన ప్రారంభమైన ఈ ఎంపికలు ఈ నెల 18వ తేదీ వరకు సెలవు రోజుల్లో మినహా నిర్వహిస్తున్నారు. ఈ నెల 8వ తేదీన వాయిదా పడిన ఎంపికలు, శనివారం జరగనున్నాయి. షెడ్యూల్ మేరకు శనివారం హాజరు కావాల్సిన వారికి సైతం దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తారు. 661 మందికి గాను శుక్రవారం 400 మంది హాజరు కాగా, తుది రాత పరీక్షకు 275 మంది ఎంపికయ్యారు.

గుండె నిండుగా.. పెద్ద పండగ



శ్రీకాకుళంలో..



ఎచ్చెర్ల క్యాంపస్: వెంకటేశ్వర కాలేజీలో కోలాటం ఆడుతున్న విద్యార్థులు

ఇంటి గోడలు
కొత్త సున్నాలతో మెరుస్తున్నాయి.
పల్లె దారులు కళ్లాపి నీళ్లతో తడుస్తున్నాయి.
కొత్త బట్టలు బీరువాలో స్థలాలు
ఆక్రమిస్తున్నాయి. సంక్రాంతి పాటలు
చక్కటి రాగాలతో వినిపిస్తున్నాయి.
పండగ కళతో బజార్లు కిటకిటలాడుతున్నాయి.
మట్టి కుండలు, దుస్తులు, ఇంటి
సామాన్లు కొనేవారు క్యూ కడుతుండడంతో
దుకాణాలన్నీ కళకళలాడుతున్నాయి.
-సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం



ఆమదాలవలస: కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

దుమ్ము దులిపేందుకు..

మార్కెట్‌లో పండగ కళ కనిపిస్తోంది. పెద్ద పెద్ద సామాన్లు పక్కన పెడితే ఈ పండగ పూట ప్రతి ఇల్లూ శుభ్రం చేసుకుంటారు. అందుకు గాను పట్లు కర్రలు, సున్నాలు వంటివి అంతా కొనుగోలు చేస్తున్నారు. నిచ్చెనలు కూడా బాగా అమ్ముడవుతున్నాయి. ఒక్కో టీ రూ.1200 వరకు పలుకుతోంది. అద్దెకు ఇచ్చే పద్ధతి కూడా కనిపిస్తోంది. రోజుకు రూ.150లు వసూలు చేస్తున్నారు. పిడకలు, గొబ్బెమ్మలు చేసే తీరిక లేకపోవడంతో వ్యాపారులు రెడీమేడ్‌వి తీసుకు వచ్చి విక్రయిస్తున్నారు. వీటి ఖరీదు ఒక ప్యాకెట్ రూ.20లు.



మేదరవీధిలో అమ్ముతున్న పట్లుకర్రలు

గిరులన్నీ విరులై..



సారవకోటలో నెయ్యిగుర్రం ప్రదర్శన ఇస్తున్న గిరిజనులు (ఫైల్)

పండగ పూట గిరులు విరులై విరబూస్తాయి. సంప్రదాయ ఆదివాసీ నృత్యాలు మళ్లీ జీవం పోసుకుంటాయి. ట్రంకు పెట్టెల్లో ఉండిపోయిన గజ్జెలు, నృత్య సామగ్రి మళ్లీ సూరీడిని చూస్తాయి. సంక్రాంతి రోజుల్లో గిరిజనులు తమ సంప్రదాయ నృత్యాలతో అలరిస్తారు. పురుషోత్తుకర్ర, రైవాడ, జగన్నాథపురం, కోనవానిపేట, బురుజువాడ, చోడసముద్రం తదితర గ్రామాలకు చెందిన గిరిజనులకు నెయ్యిగుర్రం, దెయ్యం ముఖం వేషాలతో నృత్య ప్రదర్శనలు చేస్తారు. ఈ పరికరాలను ఒడిశాలోని పర్లాకిమిడిలో కొనుగోలు చేస్తారు.

– సారవకోట

మా ఆచారం



పండగ సమయంలో నెయ్యి గుర్రం వేషధారణ ధరించి నృత్యం చేసుకుంటూ రావడం మా పూర్వీకుల నుంచి వస్తోంది. అయితే ప్రస్తుత తరం ఆ రకంగా వాయిద్యాలు వాయించే పరిస్థితి లేదు. వాయిద్యాలు, ఆకారాలను పర్లాకిమిడి నుంచి కొనుగోలు చేసి తీసుకొస్తాం

– కొత్తూరు బోడెన్న, పురుషోత్తుకర్ర గ్రామం, సారవకోట మండలం

‘వస్త్ర’శస్త్రాలు

శ్రీకాకుళం కల్చరల్: పండగ నాడు పెద్దల పేరిట బట్టలు పెట్టడం చాలా ప్రాంతాల్లో ఆచారం. ఈ సంప్రదాయం కోసం సంక్రాంతికి ప్రత్యేకంగా నేత చీరలు, లుంగీలు, పంచెలు విక్రయిస్తున్నారు. పంచెల్లో రకాల బట్టి రూ.150 నుంచి రూ.500లు వరకు అమ్ముతున్నారు. అలాగే చీరలు కూడా ఇదే ఖరీదుతో అమ్మకాలు సాగిస్తున్నారు.



పెద్దల కోసం బట్టలు కొనుగోలు చేస్తున్న దృశ్యం



30 ఏళ్లుగా వ్యాపారం చేస్తున్నాం

గత 30 ఏళ్లుగా ఈ వ్యాపారం చేస్తున్నాం. ఈ సీజన్‌లో మంచి అమ్మకాలు అవుతాయి. మాలో కొందరం నేత కార్మికుల వద్ద నుంచి బట్టలను తెచ్చి అమ్ముకుంటాం. భోగి పండగ వరకు కుటుంబం అంతా కలసి కూర్చుని వ్యాపారం చేస్తాం.

– ముఖలింగం, శ్రీకాకుళం



కాశీబుగ్గ: వివిధ రాష్ట్రాల మహిళల వస్త్రధారణలో చిన్నారులు

వ్యాపారాలు చల్లకుండ

సంతల్లో కుండలకు మంచి గిరాకీ నెలకొంది. సంక్రాంతి నాడు పూర్వీకులకు మట్టి కుండల్లోనే పదార్థాలు నివేదిస్తారు. కాశీబుగ్గలో శుక్రవారం జరిగిన సంతలో వేకువజామున చేరుకుని ఉదయానికే అమ్మకానికి ఇలా ప్రదర్శించారు.

– కాశీబుగ్గ



కాశీబుగ్గ సంతలో అమ్మకానికి మట్టికుండలు

వైఎస్సార్‌సీపీ జిల్లా కొత్త కమిటీ

- వివిధ హోదాల్లో 54 మంది నియామకం
- పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియామక ఉత్తర్వులు జారీ

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : వైఎస్సార్‌సీపీ జిల్లా కొత్త కమిటీని పార్టీ అధిష్టానం నియమించింది. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో 54 మందిని వివిధ హోదాల్లో నియామకం చేసింది. జిల్లా పార్టీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ నేతృత్వంలో ఈ కమిటీ పని చేయనుంది. పార్టీ సంస్థాగతంగా బలోపేతం కావడమే కాకుండా ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాటం చేయడమే లక్ష్యంగా కమిటీని నియమించింది. ఈ మేరకు శుక్రవారం రాత్రి నియామక జాబితాను పార్టీ అధిష్టానం విడుదల చేసింది. కోశాధికారిగా తంగుడు నాగేశ్వరరావు నియమితులయ్యారు. నియమితులైన వారి వివరాలివి.

పేరు	నియోజకవర్గం
హోదా: వైస్ ప్రెసిడెంట్	
ఎం.వీ.పద్మావతి	శ్రీకాకుళం
ఉర్లాన బాలరాజు	పాతపట్నం
రామపత్ని చిట్టిబాబు	ఇచ్ఛాపురం
కింజరాపు సురేష్	ఆమదాలవలస
అన్నెపు రామారావు	టెక్కలి
బొంతు సూర్యనారాయణ	ఎచ్చెర్ల
బగ్గు రామకృష్ణ	నరసన్నపేట
పైల వెంకటరావు	పలాస
హోదా: జనరల్ సెక్రటరీ	
ఏ.వీ.సురేష్	పాతపట్నం
గేదెల పురుషోత్తమరావు	శ్రీకాకుళం
చింతాడ ప్రసాద్	ఆమదాలవలస
కుర్మాన బాలకృష్ణ	టెక్కలి
సనపల నారాయణరావు	ఎచ్చెర్ల
హోదా: సెక్రటరీ ఆర్గనైజేషనల్	
లోచెర్ల మల్లేశ్వరరావు	పాతపట్నం
సవర సుబాష్	పాతపట్నం
జల్లు యుగంధర్	ఇచ్ఛాపురం
ఎ.పురుషోత్తంరెడ్డి	ఇచ్ఛాపురం
కొయ్యాన నాగభూషణరావు	శ్రీకాకుళం
సీపాన రామారావు	శ్రీకాకుళం
కరణం క్రిష్ణనాయుడు	ఆమదాలవలస
లావేటి విశ్వేశ్వరావు	ఆమదాలవలస
నక్కా భీమారావు	టెక్కలి
బొడ్డు వెంకటరమణ	టెక్కలి
వల్లి దాలినాయుడు	ఎచ్చెర్ల
పసపు రామదాసు	ఎచ్చెర్ల
మెజ్జాడ శ్యామలరావు	నరసన్నపేట
చిపురు కృష్ణమూర్తి	నరసన్నపేట
అగ్గున సూర్యారావు	పలాస
దువ్వాడ మధుకేశవరావు	పలాస
హోదా: సెక్రటరీ యాక్టివిటీ	
గంధవరపు నాగేంద్ర	పాతపట్నం
అమర రమణ	పాతపట్నం
దేవరాజు సాహో	ఇచ్ఛాపురం
బుద్దాన శ్రీ కృష్ణ	ఇచ్ఛాపురం
తంగి అప్పన్న	శ్రీకాకుళం
శిమ్మ భగవాన్‌దాస్	శ్రీకాకుళం
బొడ్డేపల్లి నిరంజన్	ఆమదాలవలస
పొన్నాడ చిన్నారావు	ఆమదాలవలస
ఎన్ని మన్మధరావు	టెక్కలి
పొన్నాన మోహనరావు	టెక్కలి
అంబటి రాంబాబు	ఎచ్చెర్ల
పేడాడ శ్రీరామమూర్తి	ఎచ్చెర్ల
యాళ్ల శ్యామ్ సుందర్‌రావు	నరసన్నపేట
రావాడ రామారావు	నరసన్నపేట
బోర కృష్ణారావు	పలాస
బత్తిన హేమేశ్వరరావు	పలాస
హోదా: అధికార ప్రతినిధి	
శిమ్మ సాంబశివరావు	పాతపట్నం
పూడి నేతాజీ	ఇచ్ఛాపురం
కోనాడ నర్సింగరావు	శ్రీకాకుళం
కోట గోవిందరావు	ఆమదాలవలస
సత్తారు సత్యం	టెక్కలి
పిల్లల శివకుమార్	ఎచ్చెర్ల
కరిమి రాజేశ్వరరావు	నరసన్నపేట
బమ్మిడి దుర్యోధన్	పలాస

తిరుపతి ఘటనపై ఆగ్రహం

సర్కారుదే బాధ్యత



తిరుపతి ఘటన ముమ్మాటికీ కూటమి ప్రభుత్వ వైఫల్యమేనని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. మందసలో కొలువైన వాసుదేవస్వామిని శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గత ప్రభుత్వంలో చిన్నపాటి సంఘటన సైతం జరగలేదని ఆయన గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరుమల తిరుపతి దేవస్థానంలో రాజకీయ జోక్యం బాగా పెరిగిపోయిందని విమర్శించారు. తిరుమల తిరుపతి పవిత్రతను పరిరక్షించాలన్నారు.

– కాశీబుగ్గ

ప్రభుత్వ వైఫల్యం వల్లే తొక్కిసలాట



ప్రభుత్వ వైఫల్యం వల్లనే తిరుపతిలో తొక్కిసలాట జరిగిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి ఇతరులపై నెట్టడం సరికాదని, ఇప్పటికైనా వైఫల్యాన్ని అంగీకరించి బాధితులను ఆదుకోవాలన్నారు. చనిపోయిన వారి కుటుంబాలకు రూ. 50 లక్షలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. గాయపడిన వారి జీవన భృతికి కనీసం రూ. 5 లక్షలు ఆర్థిక సాయం ప్రకటించాలన్నారు.

–నరసన్నపేట

రాజీనామా చేయాలి



తిరుపతి తొక్కిసలాటకు ప్రభుత్వ వైఫల్యమే ప్రధాన కారణమని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. చంద్రబాబు కుప్పం పర్యటన కోసం పోలీసులను తీసుకుని వెళ్లి తిరుపతి భక్తుల భద్రత గాలికి వదిలేశారని విమర్శించారు. ఘటనకు పోలీసులను, అధికారులను బలి పశువులు చేసి చర్యలు తీసుకోవటం బాధాకరమని పేర్కొన్నారు. సంఘటనకు బాధ్యత వహించి టీటీడీ చైర్మన్, దేవదాయ శాఖ మంత్రులు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

– ఎల్.ఎన్.పేట

రూ.కోటి పరిహారం ఇవ్వాలి



తిరుపతిలో తొక్కిసలాటలో మృతి చెందిన ఆరుగురు కుటుంబాలకు రూ.కోటి పరిహారం ఇవ్వాలని వైఎస్సార్ సీపీ కళింగ కుల రాష్ట్ర అధ్యక్షుడు దుంపల రామారావు డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అసమర్థ పాలనకు తిరుపతి తొక్కిసలాట నిదర్శనమన్నారు. మృతుల కుటుంబాల్లో ఒక్కరికి టీటీడీలో ఉద్యోగం ఇవ్వాలని కోరారు. వైఎస్సార్‌సీపీ హయాంలో లక్షలాది మంది భక్తులు వచ్చినా ఎప్పుడూ ఏ ఒక్కరికి ఎలాంటి అసౌకర్యం కలగలేదన్నారు.

–శ్రీకాకుళం (పీఎన్ కాలనీ)

ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం



వైకుంఠ ఏకాదశి టోకెన్ల పంపిణీ విషయంలో ప్రభుత్వం అనుసరించిన నిర్లక్ష్యం వల్లనే భక్తులు మృతి చెందారని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. టీటీడీ చైర్మన్, పాలక మండలి సభ్యుల ప్రణాళికా లోపంతో భక్తులు మృతి చెందారని మండిపడ్డారు. నిన్నటి వరకు లడ్డూ కల్తీ అంటూ తిరుపతి దేవస్థానం ప్రతిష్టకు భంగం కలిగించారని ఇప్పుడు ప్రణాళిక లోపంతో టోకెన్ల జారీతో భక్తుల మృత్యువాతకు కారకులయ్యారని దుయ్యబట్టారు.

–టెక్కలి

క్లుప్తంగా

రెండు చోరీ కేసులు నమోదు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల పోలీసులు రెండు చోరీ కేసులరె శుక్రవారం నమోదు చేశారు. కొంగరాం గ్రామానికి చెందిన నేతింటి మీనా కుమారి ఇంటిలోని బీరువాలో రెండున్నర తులాలు బంగారం గత ఏడాది ఆగస్టు ఒకటిన చోరీ జరిగింది. దోమాం పంచాయతీ కొంచా లకూర్మయ్యపేటకు చెందిన రాయవలస దిలీప్‌కుమార్ ఇంటిలో అరు తులం బంగారం గత ఏడాది అక్టోబర్ 20న చోరీ జరిగింది. ఈ చోరీలు ఆలస్యంగా గుర్తించిన బాధితులు పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై వి.సందీప్‌కుమార్ చెప్పారు.

32 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

గార: మండలంలోని వేర్వేరు చోట్ల జరుగుతున్న పేకాట శిబిరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం వమరవల్లి పంచాయతీ సుగ్గదాలినాయుడు పేట వద్ద 10 మందిని అదుపులోకి తీసుకొని రూ.29 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. కళింగపట్నం-మత్స్యలేశంలో తుమ్మచెట్లు వద్ద 22 మంది పేకాట ఆడుతుండగా రూ. 31 వేలు స్వాధీనం చేసుకున్నారు. వీరందరినీ అరెస్టు చేసి కేసు నమోదు చేశామని ఎస్‌ఐ ఆర్.జనార్దన్ తెలిపారు.

నిప్పంటుకుని మహిళకు గాయాలు

మెళియాపుట్టి: మండలంలోని గొట్టిపల్లి పంచాయతీ బరబొంతు గిరిజన గ్రామంలో నిప్పంటుకుని మహిళ గాయాలపాలైన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. లింగుపురం భారతి కట్టెల పొయ్యి వద్ద చలి కాగుతుండగా దుప్పటికి నిప్పంటుకుంది. కుటుంబ సభ్యులు ఆర్పడానికి ప్రయత్నించినా అప్పటికే వెనుక భాగం కాలిపోయి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే టెక్కలి జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లగా.. పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

పాత పెన్షన్ సాధించే వరకు పోరాటం



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జెడ్పీ సీఈవో, ఏపీసీపీఎస్‌ఈఏ ఉద్యోగులు

శ్రీకాకుళం: రాష్ట్ర ప్రభుత్వం పాత పెన్షన్ పునరుద్ధరించే వరకు పోరాటం ఆపే ప్రసక్తి లేదని ఏపీసీపీఎస్‌ఈఏ జిల్లా అధ్యక్షుడు వడమ శరత్ స్పష్టం చేశారు. శుక్రవారం శ్రీకాకుళం కలెక్టరెట్‌లో ఏపీసీపీఎస్‌ఈఏ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జెడ్పీ సీఈవో శ్రీధర్‌రాజా, ట్రెజరీ డీడీ రవి కుమార్, డీటీవో తవిటన్న చేతులమీదుగా నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ ఏపీసీపీఎస్‌ఈఏ పోరాటం ఫలితమే ఈ రోజు సీపీఎస్ ఉద్యోగులకు ఫ్యామిలీ పెన్షన్ గ్రాట్యుటీ అని పేర్కొన్నారు. పాత పెన్షన్ కోసం త్వరలో పోరాట కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అంపోలు షణ్ముఖరావు, మహిళా అధ్యక్షురాలు పి.జయమ్మ, బి.శ్యామ్‌కుమార్, డేవిడ్‌రాజు, శ్యాం సుందర్, మోహన్, కిరణ్, శ్రీధర్, సూర్య తదితరులు పాల్గొన్నారు.

నాటుబాంబు పేలుడు ఘటనలో కేసు నమోదు



బాంబు పేలిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న సీఐ

మెళియాపుట్టి: మండలంలోని భరణికోట పంచాయతీ కోధుకొలిగాం గ్రామంలో గురువారం రాత్రి నాటుబాంబు పేలిన ఘటనలో వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సాక్షిలో ప్రచురితమైన కథనానికి పాతపట్నం సీఐ రామారావు, ఎస్సై రమేష్‌బాబు స్పందించి శుక్రవారం గ్రామాన్ని సందర్శించారు. బాంబు తయారీకి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేశారు. ఇటువంటి పేలుడు పదార్థాలను ఎవరు తయారు చేస్తున్నారనే కోణంలో దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

హృదయ వేదన



పేగు వ్యాధితో విశాఖపట్నంలో చికిత్స పొందుతున్న డిక్కల శశాంక్

- మృత్యువుతో పోరాడుతున్న ఇద్దరు కుమారులు
- ఒకరికి గుండె సమస్య.. మరొకరికి పేగు సంబంధిత వ్యాధి
- ఇప్పటికే రూ.10 లక్షలు వెచ్చించిన తల్లిదండ్రులు
- దాతల సాయం కోసం ఎదురుచూపు

కొన్ని నెలల క్రితం వరకు ఆ ఇంట్లో చిన్నారుల నవ్వులు, అల్లరి చేష్టలతో సందడి వాతావరణం ఉండేది. తల్లిదండ్రులు ఇద్దరు కుమారులను అల్లారుముద్దుగా చూసుకునేవారు. ఇంతలో అనారోగ్య సమస్యలు ఇద్దరు కుమారులను చుట్టుముట్టాయి. చిన్నకుమారుడి గుండెలో రంధ్రం ఏర్పడగా.. పెద్ద కుమారుడు పేగు సంబంధిత సమస్యతో మృత్యువుతో పోరాడుతున్నాడు. పేద కుటుంబం కావడంతో తల్లిదండ్రులు దాతల సాయం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.



అన్నదమ్ములు శశాంక్, చేతన్

గార:

మండలంలోని బూరవిల్లి గ్రామానికి చెందిన డిక్కల పద్మలోచన, వినీత దంపతులకు ఇద్దరు కుమారులు. ఐదున్నరేళ్ల పెద్దబ్బాయి శశాంక్ ప్రైవేట్ స్కూల్‌కు వెళ్తుండగా.. చిన్న కుమారుడు చేతన్ ఇంటి వద్దనే ఉంటున్నాడు. పద్మలోచన ఎలక్ట్రికల్ పనులు చేస్తుండగా.. తల్లి కూలి పనులకు వెళ్తూ కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉంటోంది. పేద కుటుంబమైనా ఇద్దరు కుమారులను చక్కగా చదివించాలని భావించిన ఆ తల్లిదండ్రులకు ఊహించని విపత్తు ఎదురైంది. చిన్నబాబు శశాంక్‌కు ఆరోగ్యం బాగాలేకపోవడంతో వైద్యుల వద్దకు తీసుకెళ్లారు. గుండెకు రంధ్రం పడిందని, ఆపరేషన్‌కు అవకాశం లేకపోవడంతో బతికున్నంత వరకూ మూడు నెలలకొకసారి రూ.30 వేలు విలువ చేసే ఇంజక్షన్ వేయాలని చెప్పారు. దీంతో తల్లిదండ్రులు నిర్ఘాంతపోయారు. అసలే పేదరికం, ఆపై వేలాది రూపాయల ఇంజక్షన్లు వేయాలని చెప్పడంతో కుదేలయ్యారు. ఎలాగోలా ఖరీదైన ఇంజక్షన్‌లు కొంటూ దేవుడిపై భారం వేశారు. ఇంతలో మరోసారి విధి వెంటాడింది. పెద్ద కుమారుడు చేతన్ సైతం అనారోగ్యం బారిన పడ్డాడు. వైద్యులను సంప్రదించగా.. పేగు సంబంధిత వ్యాధి సోకిందని తెలిపారు. ఏ పదార్థం తిన్నా క్షణాల్లో వాంతి రూపంలో బయటకు వచ్చేస్తుండటంతో శ్రీకాకుళంలో అన్ని ఆస్పత్రుల్లోనూ చూపించారు. అయినా ఫలితం దక్కపోవడంతో విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. ఓ వైపు గుండె సంబంధిత వ్యాధితో మృత్యువుతో పోరాడుతున్న చిన్న కుమారుడి ఆరోగ్యం తలచుకుని పంటిబిగువున కష్టాన్ని ఉంచుకొని పెద్ద కుమారుడిని బతికించుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఆరోగ్యశ్రీకి అవకాశం లేదని ఆస్పత్రి వర్గాలు చెబుతుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విశాఖలోనే ఓ ప్రైవేటు ఆస్పత్రిలో మూడు రోజులకొకసారి రూ.పదిహేను వేలు విలువైన ఇంజక్షన్ వేస్తున్నారు. కుమారులిద్దరి ఆరోగ్యం కోసం ఇప్పటికే రూ.10 లక్షలకు పైబడి ఖర్చు చేశారు. ఇక చేసేదిలేక దాతల వైపు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇటువంటి కష్టం పగవాడికి కూడా రాకూడదని, దాతలు స్పందించి ఆదుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



తల్లిదండ్రులతో చిన్నారులు

సాయం చేయదల్చుకుంటే..

దాతలు సాయం చేయాలనుకుంటే 96522 54997 ఫోన్ నంబరును సంప్రదించాలని చిన్నారుల తండ్రి పద్మలోచన విజ్ఞప్తి చేస్తున్నారు.

పుస్తెలతాడు దొంగలు దొరికారు

- జిల్లాలో నాలుగుచోట్ల చోరీలకు పాల్పడిన ఇద్దరు ఒడిశావాసుల అరెస్టు
- ఏడున్నర తులాల బంగారం స్వాధీనం
- 32 పాత కేసుల్లో నిందితులు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో పుస్తెలతాడు చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి ఏడున్నర తులాల బంగారం స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి విలేకరులకు వివరాలు వెల్లడించారు.

బరంపురం జైలులో పరిచయం..

ఒడిశాలోని గంజాం జిల్లా బరంపురం పట్టణానికి చెందిన సుజిత్‌కుమార్ పాడి పలు గొడవల్లో అరెస్టయి జైలుకు వెళ్లాడు. ఇతనికి అదే జైలులో బరంపురం బడాబజార్‌కు చెందిన బాలకృష్ణ సాహు పరిచయమయ్యాడు. బెయిల్‌పై విడుదలైన ఇద్దరూ మద్యం, పేకాట వంటి వ్యసనాలకు బానిసయ్యారు. కూలి పనులు చేయగా వచ్చిన డబ్బులు వ్యసనాలకు సరిపోకపోవడంతో దొంగతనాలు చేయాలని నిశ్చయించుకున్నారు. ఈ క్రమంలోనే బరంపురం, పర్లాఖిముండి, కాశీనగర్, గురండి వంటి ప్రాంతాల్లో ఒంటరి మహిళలను టార్గెట్ చేసి బైక్‌పై వెళ్తూ పుస్తెల తాడులు తెంపేవారు. ఈ చోరీల్లో కేసులు నమోదై అరెస్టు అయ్యి మళ్లీ జైలు జీవితం గడిపారు.

మన జిల్లాలో 32 నేరాలు

బెయిల్‌పై విడుదలయ్యాక శ్రీకాకుళం జిల్లాలో ఏవోబీ ప్రాంతంపై వీరి కన్ను పడింది. 2016 నుంచి 2024 వరకు ఏకంగా 32 నేరాలు చేశారు. నాలుగు కేసుల్లో (కంచిలి, మందస, బారువ, నందిగాం) శిక్ష కూడా పడింది. కోటబొమ్మాళి పీఎస్ పరిధి కేసులో జైలు నుంచి విడుదలైన వీరు మళ్లీ పర్లాఖిముండి, కాశీనగర్, గురండి పీఎస్‌ల పరిధిలో నేరాలు చేసి అరెస్టు అయ్యి ఆరు నెలలపాటు పర్లాఖిముండి జైలులో గడిపారు.



కొత్తూరు చోరీ కేసుతో..

2024 డిసెంబరు 28న మధ్యాహ్నం మూడున్నర సమయంలో కొత్తూరు మండలం కాశీపురం రోడ్డులో ఓ మహిళ పొలం చూడటానికి ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తుండగా ఎదురుగా ద్విచక్రవాహనంపై వచ్చిన సుజిత్‌కుమార్, బాలకృష్ణలు బండి ఆపారు. ఆమె మెడలో ఉన్న ఒకటిన్నర తులాల పుస్తెల తాడు తెంచుకుపోయారు. దీనిపై బాధితురాలి సోదరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొత్తూరు సీఐ చింతాడ ప్రసాద్, ఎస్‌ఐ మహ్మద్ అమీర్ ఆలీలు తమ బృందాలతో దర్యాప్తు ప్రారంభించారు. అనేక విషయాలు వెలుగులోకి రావడంతో అడిషనల్ ఎస్పీ (క్రైమ్) పి.శ్రీనివాసరావు సైతం పర్యవేక్షించారు.

ఒంటరి మహిళలే లక్ష్యంగా..

దర్యాప్తులో చోరీ చేసింది ఒడిశాకు చెందిన సుజిత్, బాలకృష్ణలే అని తెలుసుకున్న పోలీసులు.. అదే రోజు ఎచ్చెర్ల బైపాస్ హైవే రోడ్డు పక్కన గొర్రెలు మేపుతున్న మహిళ మెడలో వీరిద్దరూ రెండు తులాల పుస్తెల తాడు తెంపగా అరతులం ఆమె చేతిలో ఉండిపోయి మిగిలిన ఒకటిన్నర తులాలు పట్టుకుపోయినట్లు విచారణలో తేలింది. 2024 డిసెంబరు 5న కోటబొమ్మాళి మండలం నారాయణవలస సంతకు వెళ్లి సామాన్లు కొనుక్కొని ఇంటికి ఒంటరిగా నడిచివెళ్తున్న మహిళ మెడలో ఒకటిన్నర తులాల పుస్తెల తాడు తెంపేశారు. 2024 నవంబరు 8న మందసలో పశువుల మేపుతున్న మహిళ మెడలో రెండున్నర తులాలు పుస్తెల తాడు తెంపేశారు. దొంగిలించిన సొత్తునంతా బరంపురంలో వారి ఇంట్లో దాచిపెట్టారు. ఈ నెల 9న మళ్లీ చోరీలు చేయాలనే ఉద్దేశంతో బైక్‌పై వస్తూ మెట్టూరు కూడలి వద్ద కొత్తూరు పోలీసులకు పట్టుబడ్డారు. నిందితుల వద్ద సొత్తును వంద శాతం రికవరీ చే శామని, రిమాండ్‌కు శుక్రవారం తరలించామని ఎస్పీ మహేశ్వరరెడ్డి తెలిపారు. అడిషనల్ ఎస్పీ పి.శ్రీనివాసరావు సమక్షంలో కేసును చాకచక్యంగా ఛేదించిన పోలీసు అధికారులను, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

117 సవరణ ఉత్తర్వులు సరికాదు

శ్రీకాకుళం న్యూకాలనీ: 117 జీవో రద్దుపేరుతో కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన సవరణ మార్గదర్శకాలు సమంజసంగా లేవని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గురుగుబెల్లి రమణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 117 జీవో రద్దును స్వాగతిస్తున్నామని.. అయితే సవరణలు పూర్తిగా లోపభూయిష్టంగా ఉన్నాయని మండిపడ్డారు. గత ఉత్తర్వుల మాదిరిగానే ఈ సవరణ ఉత్తర్వుల్లోనూ సమీప పాఠశాలల నుంచి 3,4,5 తరగతులను తరలించి ఆదర్శ ప్రాథమిక పాఠశాలగా ఏర్పరచడం, ఫౌండేషన్ పాఠశాలలో 30 మంది విద్యార్థుల వరకూ ఒక్కరే టీచర్‌ను ఇవ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు చెప్పారు. ఉన్నత పాఠశాలగా ఉన్నతీకరణ పేరుతో ప్రాథమికోన్నత పాఠశాలలని పూర్తిగా మూసి వేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం హేయమైన చర్యగా అభివర్ణించారు. ప్రతి ఉన్నత పాఠశాలలో హెడ్మాస్టర్, పీడీ పోస్టులు కచ్చితంగా ఉండాలని, సెక్షన్ల వారీగా కాకుండా రోల్ ఆధారంగా ఉన్నత పాఠశాలలో పోస్టులు ఉండాలని పేర్కొన్నారు. ముఖ్యంగా ఇంగ్లీషు, తెలుగు రెండు మీడియంలు కొనసాగాలన్నారు. ప్రభుత్వం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఫిబ్రవరి 6 నుంచి ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలు



సమావేశంలో మాట్లాడుతున్న గుజ్జుల ఈశ్వరరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళంలో ఫిబ్రవరి 6నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న 22వ రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలని ఏఐవైఎఫ్ మాజీ జాతీయ కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. శ్రీకాకుళం నగరంలో సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ సర్కారు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి నేడు నిరుద్యోగులను మోసగించిందని దుయ్యబట్టారు. మహిళలు, చిన్నారులపై దాడులు పెచ్చుమీరుతున్నా నిలువరించకపోవడం దారుణమన్నారు. ఉత్తరాంధ్రకు జీవనాధారంగా ఉన్న స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు కేంద్ర ప్రభుత్వం పూనుకోవడం, కేంద్ర ప్రభుత్వానికి సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ వత్తాసు పలకడం ఉత్తరాంధ్ర ప్రజల మనోభావాలను దెబ్బతీయడమేనన్నారు. ఈ విషయాలన్నింటిపైనా రాష్ట్ర మహాసభలలో చర్చించి భవిష్యత్ పోరాటానికి నాంది పలుకుదామన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడ యుగంధర్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.నాగభూషణం, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సీహెచ్.రవి, ఏఐవైఎఫ్ నాయకులు అరవింద్, వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

పీఎఫ్ ఖాతా సమస్యలు పరిష్కరించండి



జెడ్పీ సీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న బీటీఏ నాయకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: పీఎఫ్ బకాయిలతోపాటు ఖాతా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు సీర రమేష్‌బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల ప్రతాప్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జెడ్పీ సీఈఓ శ్రీధర్‌రాజాకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న టీచర్లు పీఎఫ్ ఖాతాలలో దాచుకున్న డబ్బును అత్యవసరాల నిమిత్తం తీసుకుందామని దరఖాస్తు చేసుకున్నప్పటికీ.. అతీగతీ లేకపోవడం బాధాకరమన్నారు. 2024 ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు పీఎఫ్ క్లోజర్స్ లోన్లు క్రెడిట్ కాకపోవడం, షెడ్యూల్స్‌ని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయకపోవడం వంటి సమస్యల కారణంగా ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులతోపాటు లోన్లు పెట్టుకున్న టీచర్లు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులు చొరవ తీసుకుని పీఎఫ్ ఖాతాల సమస్యలు, బకాయిలు వెంటనే విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని రమేష్‌బాబు, ప్రతాప్‌కుమార్ కోరారు. సానుకూలంగా స్పందించిన సీఈఓ తగు చర్యలు తీసుకుంటామని బదులిచ్చినట్టు వారు చెప్పారు.

కిటకిటలాడిన కాంప్లెక్స్







పండగ సెలవులు కారణంగా రద్దీమయంగా కనిపించిన ఆర్టీసీ కాంప్లెక్స్

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ శుక్రవారం ప్రయాణికులు, విద్యార్థులతో కిటకిటలాడింది. శుక్రవారం నుంచి పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ఇవ్వడంతో విద్యార్థుల తల్లిదండ్రులు, బంధువులు వచ్చి వారిని స్వగ్రామాలకు తీసుకెళ్లేందుకు ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చేరుకోవడంతో రద్దీగా కనిపించింది. ఇక దూరప్రాంతాల నుంచి ప్రయాణికులు భారీగా స్వస్థలాలకు చేరుకోవడంతో బస్సులన్నీ కిక్కిరిసి కనిపించాయి. కొంతమంది సీట్ల కోసం ఎగబడ్డారు. హిరమండలం, కొత్తూరు, బత్తిలి, టెక్కలి, పలాస వంటి మారుమూల దూరప్రాంతాలకు వెళ్లే బస్సులు సమయానికి రాకపోవడంతో ప్రయాణికులకు ఎదురుచూపులు తప్పలేదు.

వైభవంగా శ్రీముఖలింగేశ్వరుని తిరువీధి

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో పుష్యమాసం శుద్ధ ఏకాదశి సందర్భంగా శుక్రవారం రాత్రి తిరువీధి ఉత్సవం నిర్వహించారు. గణపతి పూజతో ప్రారంభించి శ్రీముఖలింగేశ్వరునికి అర్చనలు, అభిషేకాలు, పూజలు చేశారు.

మాక్‘డ్రిల్’

ఓవైపు అమ్మోనియం లీకేజీతో కార్మికుడి అస్వస్థత.. మరోవైపు భయాందోళనకు గురై తోటి కార్మికులు ఆందోళనకు గురికావడం.. ఇంకోవైపు పరిశ్రమలు, అగ్నిమాపక, ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది సహాయక చర్యలు.. ఇలా పొన్నాడలోని దీపక్ మైనింగ్ సొల్యూషన్స్ లిమిటెడ్ యూనిట్ పరిశ్రమలలో శుక్రవారం హడావుడి వాతావరణం నెలకొంది. అయితే ఇదంతా మాక్‌డ్రిల్ అని తెలుసుకుని అందరూ ఊపిరిపీల్చుకున్నారు. అమ్మోనియం వంటి ద్రావణం లీకేజీ సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలు, వైద్య సేవలు, ప్రమాద నియంత్రణపై కార్మికులు, ఉద్యోగులకు భద్రతా సిబ్బంది అవగాహన కల్పించారు. యూనిట్ హెడ్ మనోజ్ అడ్డాల, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు. – ఎచ్చెర్ల క్యాంపస్



క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స చేస్తూ..



పరిశ్రమ భద్రతపై సూచనలిస్తున్న అధికారులు



అంబులెన్స్‌లో క్షతగాత్రులను తీసుకువెళ్తూ..



పరిశ్రమ వద్దకు చేరుకున్న ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు



అమ్మోనియా లీక్ ట్రయల్ నిర్వహిస్తున్న సిబ్బంది